క్లుప్తంగా

ఈదురు గాలులకు కూలిన చెట్లు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు చెట్లు కూలిపోయి ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎ. కొండూరు మండలం కంభంపాడు సమీపంలో ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై, గంపలగూడెం మండలం పెనుగొలను, మేడూరు, సత్యాలపాడు గ్రామాల వద్ద తిరువూరు–మధిర ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు విరిగి పడ్డాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగెలపై పడటంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం



ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఈలప్రోలు గ్రామంలో తాటిచెట్టుపై పిడుగుపడి చెట్టు దగ్ధమైంది. మండలం వ్యాప్తంగా మంగళవారం ఈదురు గాలులు, అకాల వర్షం పడింది. ఎస్సీ కాలనీ సమీపంలోని వ్యవసాయ పంట పొలాల్లో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు భయకంపితులైయ్యారు.

ప్రశాంతంగా ఈసెట్

తిరువూరు: పాలిటెక్నిక్ డిప్లమో అనంతరం ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జేఎన్‌టీయూ అనంతపురం నిర్వహించిన ఈసెట్ 2025 పరీక్ష మంగళవారం తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 256 మంది, సాయంత్రం 253 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

యోగాలో ఎల్బీఆర్సీఈ విద్యార్థుల ప్రతిభ

మైలవరం: రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు బాలుర కేటగిరీలో ఎం. గౌతమ్ స్వర్ణ పతకం, జి. షణ్ముఖ్ రజత, సీహెచ్ అనురాఘవ కాంస్య పతకం కైవశం చేసుకున్నారన్నారు. బాలికల విభాగంలో కె.భవానీ రజత పతకం సాధించిందని చెప్పారు. విద్యార్థులు జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు కోల్‌కతాలో జరుగనున్న జాతీయ స్థాయి యోగా చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన యోగా మాస్టర్ మాణిక్యాలరావును ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ప్రారంభం

జి.కొండూరు: మండల పరిధి కుంటముక్కల గ్రామంలో లింగాల సుందరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ వేసవి శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వంగూరు కుమారి అన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ వేసవి శిబిరాన్ని సర్పంచ్ కుమారి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయ కన్వీనర్ కెనడి పాల్గొన్నారు.

పరిశోధనా కేంద్రాలుగా గుర్తించాలి

మైలవరం: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను పరిశోధన కేంద్రాలుగా గుర్తించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాంజీని మంగళవారం ఆయన కార్యాలయంలో సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు విన్నవించారు. సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జె. రాముడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ఆగిరిపల్లి: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఏపీఎం రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి చెన్నారావు అన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన గ్రామ సభలో చెన్నారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చునని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. మండల ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి అల్ఫొన్సా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలోని మినరల్ వాటర్ ప్లాంట్, రెండు ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంకులు, నంబర్ ఐదు రేషన్ షాపును రెడ్డిగూడెం తహసీల్దార్ జె. సుశీలాదేవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, పంచాయతీ సెక్రటరీ ఎం. వెంకటేశ్వరరావు, వీఆర్వో నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంచేసిన మొక్కజొన్న

ఓ ప్రైవేటు కంపెనీ ఆర్గనైజర్లు చెప్పిన మాటలు నమ్మి విత్తన మొక్కజొన్న (సీడ్ మొక్కజొన్న) సాగు చేసిన పేద రైతులు దిగబడులు రాకపోవడంతో నష్టాలపాలయ్యారు. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అడిగితే కంపెనీ ఆర్గనైజర్ ముఖం చాటేస్తుండగా, తమకేమీ సంబంధం లేదని కంపెనీ ప్రతినిధులు పేర్కొంటుండటంతో పేద రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

- విత్తన మొక్కజొన్న సాగులో రాని దిగుబడులు
- బోర్వంచలో అప్పుల పాలైన 30 మంది పేద రైతులు
- పట్టించుకోని కంపెనీ ప్రతినిధులు
- నష్టపరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్



కంపెనీ నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)

నూజివీడు: మండల పరిధి బోర్వంచకు చెందిన 30 మంది పేద రైతులు ఎకరా రూ.20 వేల నుంచి రూ.30 వేలకు కౌలుకు తీసుకొని ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన సీడ్ మొక్కజొన్నను సాగు చేశారు. సాగు చేసే ముందు ఎకరాకు మూడు నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని, దానిని టన్ను రూ.30 వేలకు తామే కొనుగోలు చేస్తామంటూ ఆర్గనైజర్లు నమ్మబలకడంతో సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చారు. ఒకవేళ దిగుబడి రాకపోతే ఎకరాకు రూ.90 వేలు నష్టపరిహారం అందజేస్తామని చెప్పడంతో గ్రామంలో వీరంతా కలిసి 68 ఎకరాల్లో విత్తన మొక్కజొన్నను సాగు చేయగా దిగుబడి అర టన్ను నుంచి టన్ను మాత్రమే వచ్చింది. కంపెనీ మాత్రం అడ్వాన్సుగా ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి ఇచ్చింది. వచ్చిన దిగుబడిని సైతం కంపెనీనే తీసుకొని వారికి దిగుబడి తాలూకు డబ్బులు చెల్లించకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా పేద రైతులను గాలికొదిలేసింది. దీంతో వారు ఏమి చేయాలో తెలియక సబ్ కలెక్టర్‌ను ఆశ్రయించి తమకు కంపెనీ నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

అప్పుల ఊబిలో పేద రైతులు

విత్తన మొక్కజొన్న సాగు చేస్తే లాభాలు వస్తాయనే ఆశతో రైతులు అప్పులు చేసి పంటను సాగు చేశారు. దిగుబడి రాకపోవడంతో తామంతా అప్పులపాలయ్యామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు కాకుండా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు పెట్టుబడి అయిందని, దిగుబడి బాగా తక్కువ రావడంతో చేసిన అప్పులు ఎలా తీరతాయోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడు టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది



ప్రైవేటు కంపెనీకి చెందిన విత్తన మొక్కజొన్న పంటను 11 ఎకరాల్లో సాగు చేస్తే 7 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది. దీనికి పెట్టుబడి కింద రూ.4.10 లక్షలు అవ్వగా కంపెనీ అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు ఇచ్చింది. మిగతా మొత్తం అప్పుచేసి సాగు చేశా. దిగుబడి వచ్చిన 7 టన్నులు మొక్కజొన్నను తీసుకెళ్లారు కానీ ఇంకా వాటి తాలూకు డబ్బులు ఇవ్వలేదు. నష్టపరిహారం ఇవ్వడం లేదు.

– హరికోటి రామారావు,
బోర్వంచ, నూజివీడు మండలం

రెండు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు



ఎకరా రూ.20 వేల చొప్పున కౌలుకు తీసుకొని 3.50 ఎకరాల్లో విత్తన మొక్కజొన్న సాగుచేశా. కంపెనీ చెప్పినంత కాకుండా దిగుబడి 5 టన్నులు మాత్రమే వచ్చింది. పండిన మొక్కజొన్నలను తీసుకెళ్లారే కాని ఇంత వరకు డబ్బులు చెల్లించలేదు. రెండు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– రామకూరి జయరాజు,
బోర్వంచ, నూజివీడు మండలం

భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నూజివీడు: డివిజన్ పరిధిలో భూముల రీ సర్వేను సర్వే అధికారులు, సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వే సిబ్బందికి మంగళవారం రీ సర్వేపై వర్క్‌షాపు నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమక్షంలోనే వారి భూముల వివరాలకు సంబంధించి డాక్యుమెంట్లను తీసుకొని సర్వే చేయాలన్నారు. ఎలాంటి విమర్శలకు, అవకతవకలకు తావు లేకుండా కచ్చితమైన కొలతలతో రీ సర్వే నిర్వహించాలన్నారు. రీ సర్వే వల్ల నూతన రికార్డులు తయారవుతున్న నేపథ్యంలో దృష్టంతా రీ సర్వేపైనే ఉంచాలని సూచించారు. ఎవరైనా రైతులు అభ్యంతరం తెలిపితే వారి అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. ఆరు మండలాలకు చెందిన తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, డీఐ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయిలో పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: చాట్రాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్తను తొలగించి మురుగు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దొడ్డిదారిన విద్యుత్ చార్జీల పెంపు దారుణం





మైలవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన : లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న స్వామిదాసు తదితరులు

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల్లో బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ చార్జీల భారం మోపిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తిరువూరు మండలం లక్ష్మీపురం విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళనా కార్యక్రమం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ ఏడాది కాలంలోనే రూ.15,400 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిన కూటమి ప్రభుత్వం ఒక్కసారి ఎన్నికల మేనిఫెస్టోలో ఏమి హామీలిచ్చారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక సామాన్య కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని చెప్పారు. కూటమి పార్టీలిచ్చిన హామీలకు నేను గ్యారంటీ అన్న పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌన వ్రతం దాల్చడం శోచనీయమని చెప్పారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ కృష్ణారెడ్డికి మెమోరాండం అందజేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్, చలమాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, విస్సన్నపేట, గంపలగూడెం, ఎ.కొండూరు మండల అధ్యక్షులు దుర్గారావు, వినయ్‌కుమార్, గన్యా, నాయకులు నరెడ్ల వీరారెడ్డి, గజ్జల సీతారామయ్య, పుల్లారావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, వెలుగోటి ఆదినారాయణ, మామిడి కుటుంబరావు, యరదేశి రామారావు, వాళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి..

మైలవరం: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ నాయకులు సర్నాల తిరుపతిరావు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ ఆదేశాల మేరకు జరిగిన కార్యక్రమంలో తిరుపతిరావు మాట్లాడుతూఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచబోమని అబద్ధపు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో రూ.300 వచ్చిన కరెంట్ బిల్లు ప్రస్తుతం రూ.600లకు పెరిగిందన్నారు. అనంతరం ఏఈ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, పార్టీ మైలవరం, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల అధ్యక్షులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు ఉచిత న్యాయ సహాయం

నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష



మాట్లాడుతున్న ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష

నూజివీడు: కార్మికులకు ఎలాంటి సమస్యలున్నా పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని, వారు పట్టించుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ. అనూష అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కార్మికులకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయస్థానాల్లో కేసుల విషయంలో న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, కార్యదర్శి హరిబాబు, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు డిమాండ్
- తిరువూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన



ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు

తిరువూరు: అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం రైతులందరి నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరువూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ ప్రభుత్వమే పంటలు కొనుగోలు చేయకపోతే రైతులు ఎవరిని అడగాలని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ధాన్యం గింజను రైతుల నుంచి కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయడంతో పాటు ధాన్యం కొనుగోలుకు గ్రామ స్థాయిలోనే కార్యాచరణ రూపొందించేవారన్నారు. ఇప్పటికీ పలు గ్రామాల్లో ధాన్యం రాశులు పోసి ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల్లో రాజకీయ కారణాలతో ఒక వర్గానికే ప్రయోజనం కలుగుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో పెత్తందారీ విధానం గ్రామాల్లో వేళ్లూనడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వైఎస్సార్ సీపీ రైతుల తరఫున ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందాలి

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని ఉపాధ్యాయులు వెంకటరామయ్య అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందాలని చెప్పారు. పుస్తక పఠనం వలన జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో మంగళవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. కాలుష్యం కారణంగా కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో బొమ్మలు గీశారు. ప్లాస్టిక్ భూతం, చెట్ల నరికివేత తదితర అంశాలను వివరిస్తూ గీసిన బొమ్మలకు జ్ఞానగీతమ్ ట్యూషన్ పాయింట్ సహకారంతో నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 75 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. హరికృష్ణ తెలిపారు. పోటీలను జేవీవీ సభ్యులు సుధాకర్, పాపారావు, జగన్మోహనరావు, వెంకటస్వామి పర్యవేక్షించారు.

తిరువూరు శాఖా గ్రంథాలయంలో..

తిరువూరు శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో నీతికథల పుస్తకాలు చదివించారు. గ్రంథాలయ ఉపయోగాలను, మానవతా విలువలను గురించి సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు వివరించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో కథలు చదవడం, కథలు చెప్పించడం, చేతిరాత నేర్పడం, బొమ్మల తయారీలో శిక్షణ ఇచ్చారు. జనరల్ నాలెడ్జి ప్రశ్నలను అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. గ్రంథాలయాధికారి శ్రీలత పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఆర్‌డబ్ల్యూఎస్, సీపీ డబ్ల్యూఎస్ మైలవరం సబ్ డివిజన్ కార్మికుల సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో మూడు నెలల బకాయిలు, 2022 జులై నుంచి 2023 డిసెంబర్ వరకు పెంచిన 10 శాతం వేతన బకాయి, 2024–25లో పెంచిన 5 శాతం వేతన బకాయి విడుదల చేయాలని కోరారు. నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నీటి పన్ను బకాయిలు వసూలు చేయాలి

నూజివీడు: రైతులు చెల్లించాల్సిన నీటి పన్ను బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని తహసీల్దార్ బీవీ సుబ్బారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నీటి పన్ను వసూళ్లపై నీటి సంఘాల అధ్యక్షులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతుల నుంచి నీటి పన్ను బకాయిలు రూ.8 లక్షలు రావాల్సి ఉందని, దానిని జూన్ నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు కూడా ఎవరైతే బకాయి ఉన్నారో వారికి చెప్పి నీటి పన్ను చెల్లించేటట్లు చూడాలని సూచించారు.

కానిస్టేబుల్‌పై వేధింపుల కేసు నమోదు

తిరువూరు: తనను భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తూ, అదనపు కట్నం తీసుకురావాలని హింసిస్తున్నాడని తిరువూరుకు చెందిన షేక్ సాధఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆమె భర్త ఇస్మాయిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరువూరుకు చెందిన సాదఖాన్‌కు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం ముస్తఫా నగర్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్‌తో 2015లో వివాహమైంది. ఖమ్మంలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఇస్మాయిల్ పెళ్ళయిన మూడేళ్ల తర్వాత నుంచి సాధఖాన్‌ను పిల్లలు కలగట్లేదని హింసించేవాడు. 2023లో వీరికి కుమారుడు జన్మించిన తర్వాత ఇస్మాయిల్ తాగుడుకు బానిసై వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. తరచు అదనపు కట్నం తెమ్మని వేధిస్తూ గతేడాది సెప్టెంబర్లో గడ్డిమందు తాగించి చంపడానికి యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేత్ర వైద్యంపై అవగాహన

మైలవరం: మానవ శరీరంలోని అవయవాలలో నయనం ప్రధానమని, మన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ మైలవరం కో–ఆర్డినేటర్ జె. రమేష్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కంటి వైద్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించి, కథలు చెప్పించారు. ఇండోర్ గేమ్స్ ఆడించారు.

నేడు వాసవీ మాత నగరోత్సవం

తిరువూరు: వాసవీ మాత జన్మదినం సందర్భంగా తిరువూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అభిషేకాలు, విశేషాలంకరణ జరుగుతుందని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దారా శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు సామూహిక కుంకుమార్చన, 108 ప్రసాదాలతో నైవేద్యం, సాయంత్రం 5 గంటలకు బైపాస్ రోడ్డు విఘ్నేశ్వరాలయం సెంటర్ నుంచి వాసవీమాత నగరోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో వైద్యునికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఇబ్రహీంపట్నం: ఈనెల 20న ఆశా వర్కర్ల సమ్మెను విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల కోరారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆశా వర్కర్లతో కలిసి ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులకు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆశాలను, స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఆశా వర్కర్స్ లీడర్స్ మార్గరేట్, అంజలి, నాగమణి, త్రిలోచన, మీనా, ఉషా తదితరులు పాల్గొన్నారు.

- తిరువూరు: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు తిరువూరులో ఆశా కార్యకర్తలు ఈ నెల 20న సమ్మెకు దిగుతున్నట్లు వైద్యాధికారులకు మంగళవారం నోటీసులు అందజేశారు. కార్మికుల హక్కులు హరించే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనంతో పాటు చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జరిగే సమ్మెలో తాము పాల్గొంటామని ఆశా వర్కర్లు తెలిపారు. తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చౌటపల్లి, రాజుగూడెం పీహెచ్‌సీలలో వైద్యాధికారులకు నోటీసులను సీఐటీయూ మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు అందజేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నూజివీడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చని, తద్వారా డెంగీ, మలేరియా వ్యాధులు దరిచేరవని సబ్ యూనిట్ అధికారి ఎం. యల్లమంద అన్నారు. దిగవల్లి పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశా డేలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా వారిని చైతన్యపరచాలన్నారు. మురుగునీటి గుంతలు లేకుండా చూడాలని చెప్పారు. డెంగీ కారక దోమ మంచినీటి నిల్వల్లో పెరుగుతుందని, కనుక మంచినీరు కూడా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. వైద్యాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల దాడులు

జి.కొండూరు: మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జి.కొండూరు మండల పరిధి కందులపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న మద్యం షాపునకు సమీపంలో వెలగలేరు గ్రామానికి చెందిన కొండేటి కృషి, పెద్దపూడి అశోక్, యర్రగుంట ఉదయ్‌కుమార్, గొర్రె మనోజ్ వర్గానికి చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన మందా సురేంద్ర వర్గానికి సోమవారం రాత్రి మద్యం సేవించిన అనంతరం వివాదం తలెత్తింది. ఈ క్రమంలో మందా సురేంద్రపై రెండవ వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇటుకలతో దాడి చేశారు. ఈ దాడిలో సురేంద్రకు తీవ్ర గాయాలు కాగా దాడి చేసిన వర్గానికి చెందిన కొండేటి కృషికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం సురేంద్రను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

చాట్రాయి: బాల్య వివాహాలు చేయడం నేరమని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రమణ అన్నారు. చాట్రాయి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య పరిరక్షణపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.